
కొండగాలి సవ్వడి, దూరంలో మరోవైపు చిరుత గాండ్రింపు. చెట్ల పొదలలో పక్షుల కిల కిలారావాల ధ్వనులలో బూరుచెట్ల మధ్యలో శంకులమ్మ ఆలయం చుట్టూ వున్న పిట్ట గోడలు కూలిపోయాయి. వాటికి అడ్డుగా ముళ్ళ కంపలతో గోడలా నిర్మించి ఉంచారు. అక్కడి ముళ్ళ పొదలలో నాగులు నివాసముం టున్నాయి. అప్పుడప్పుడు అవి విసవిసా పరుగు తీస్తూంటాయి. ఆలయం వెనుక వైపున పెద్ద కోనేరు. కొందరు చెరువు అంటారు. మరి కొందరు సరస్సు అంటారు. కొండల నుంచి వచ్చిన నీరు, ఆ సరస్సులో చేరి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తూ ఉంటుంది.

ఆలయ సమీపంలోనే గిరిజన తండా అందు లోని వారికి పెద్దదిక్కు యాదవ్వ. తన పూరిగు డిసె నుంచి గుడి ముందు భాగానికి నడిచి వస్తోంది. భుజం పైన సంచి, కర్రపోటుతో నడ వలేక ఆయాసంతో తేలిపోతున్న కళ్లతో, దీనంగా దిక్కులు చూస్తూ భారంగా అడుగులు వేస్తూ నడుస్తోంది యాదవ్వ.



# శంకులమ్మ

-శనగవరపు బాలసుబ్రహ్మణ్యం

యాదవ్వకు వయస్సు కోరి కలు తీరిపోయాయి. సంతానం దూర ప్రాంతాలకు వెళ్ళిపోయారు. యాది యాదక్క అయిపోయి కాలం తెచ్చిన మార్పుతో యాదమ్మ నుండి యాదవ్వగా మారిపో యింది.

ఆ గిరిజన తండాలో ఎవరికి ఏ జబ్బు వచ్చినా వైద్యం చేస్తుంది. అందరికీ ధైర్యం చెప్పి సేవ చేసి సేద దీరుస్తుంది. ఎలాంటి రోగమైనా ఆమె భుజంపైనున్న మందుల సంచీలో అన్నింటికి మందులు ఉంటాయి. ధనం కంటే సేవే ముఖ్యం యాదవ్వకు. అదే ఆమె సిద్ధాంతం. అక్కడ అందరికీ పెద్దదిక్కు.. వారి కష్టాలు తనవిగా భావించి సపర్యలు చేస్తుంది యాదవ్వ.

ఆ గూడెం వాసుల జీవన విధానానికి వారి బతుకు లకు వారి ఆశలకు, ఆశయాలకు, ఆలోచనలకు అవాం తరాలు వచ్చేస్తున్నాయి. కోడికూస్తే తెల్లవారితే బతు కెట్లా, బతికేదెట్లా, ఈ తిప్పను ఈ గుడిని ఈ గుడిసె లను, ఈ బూరు చెట్లను వదలి ఎలా బతకాలి? ఎక్కడ బతకాలి ఇక్కడ కట్టబోతున్న ప్రాజెక్టు కొరకు గూడెం వదిలి వెళ్ళాలట? ఎలా? ఎలా?

* * *

శంకులమ్మ ఆలయం రాతి కట్టడం. లోన గర్భగు డిలో అమ్మవారి విగ్రహం. మరోవైపు రామ, లక్ష్మణ సీతమ్మ విగ్రహాలు చిన్నవి. ఆ ఆలయం ఆ ప్రాంతం లోని తొమ్మిది గూడేలకు ఆ గుడి ఒక్కటే. అక్కడ ఉన్నది అందరూ గిరిజనులే. అమ్మ తల్లి బిడ్డలే. గిరిపు త్రులే. ఆ కొండల గుర్తులే ఆ అడవి బిడ్డలే.

శంకులమ్మ అన్నా, అమ్మ గుడి అన్నా, వారికి ప్రాణం. సంవత్సరానికి ఒకసారి అక్కడ జాతర జరు గుతుంటుంది. ఆనాడు ఆ తల్లి వారికి ప్రత్యక్షంగా కని పిస్తుందని వారి కోర్కెలు తీరుస్తుందని వారి నమ్మకం.

ఆలయంలో అమ్మ తల్లికి, కాయలు, ఆకులు, పాలు, పండ్లు, భక్తితో నైవేద్యంగా సమర్పిస్తారు. ఆ పండ్లను సగం కొరికి అమ్మవారి ముందుంచి ప్రసాదంగా స్వీక రిస్తారు. ఎంగిలి పండ్లను ఇవ్వడం అక్కడి గిరిజనుల ఆచారం.

ఆలయం ముందు వేలాది మంది గిరిజనులు ఆతృ తగా ఎదురు చూస్తున్నారు. వారిలో ఆవేదన తొంగి చూస్తూ ఉంది. ఆ ప్రాంతం వదలి మరోచోట బతకా లంటే వారికి అంగీకారం కాదు.

ఆ గుడిని, ఆ తిప్పలను, ఆ గాలిని, ఆ సరస్సును, ఆ చెట్లను, ఆ పుట్టలను, ఆ ప్రాంతాన్ని వీడి సుదూర తీర ప్రాంతాలకు పోయి బతకడం వారికి ఏ మాత్రం ఇష్టం లేదు.

అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రాజెక్టు ఇక్కడే నిర్మించి తీరాలి. మీరు ఖాళీ చేయవలసిందే. ఇది ప్రభుత్వ అటవీ భూమి. మీకు ఈ భూమిపై ఎలాంటి హక్కులు లేవు. ఏదో ఇంతకాలం దయత లచి ఇక్కడ ఉన్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఉండాలి. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఎంతో ఉప యోగం ఉంది. వేలాది ఎకరాలకు ఈ నీరు వినియో గంలోకి వస్తాయి. వందలాది మందికి భృతి కల్పించ బడుతుంది.

గుడి ముందు నిర్మించిన వేదిక మీద నుంచి ప్రాజెక్టు అధికారి సుదీర్ఘ ఉపన్యాసం చేస్తున్నారు. వారి గుడిసెలను ఖాళీ చేయమంటున్నాడు. మరోచోట పక్కా గృహాలను నిర్మించి ఇస్తామంటున్నాడు. సార వంతమైన భూమిని ఇవ్వడమే కాక, మీ పిల్లలకు బడులు, మీ ఆలయాన్ని మరోచోట సుందరంగా నిర్మించి ఇస్తామంటున్నాడు.

అధికారి పలుకులతో అమాయక గిరిజనులకు భయం పట్టుకుంది. అందరూ యాదవ్వను గమనిం చారు. గాజుకళ్లతో యాదవ్వ అందరినీ చూసింది. వారిలోని ఆవేదనను అర్థం చేసుకున్న ఆ ముదుసలి. కర్రపోటుతో వేదిక మీదకు చేరి, చీర కొంగును సర్దు కుని భుజంపైనున్న సంచిని పైకి లాక్కుని ప్రాజెక్టు అధికారిని, వేలాది మంది గిరిజనులను చూసి మూతపడుతున్న కళ్లను కళ్లనీళ్లను తుడుచుకుని

'పెద్దపెద్ద అయ్యలు, మేం పేద గిరిజ నులం. నేను ఈ గూడెంలోనే పన్నెండు వందల పైచీల పూర్ణములను చూశాను. ఈడ నున్న భూమి ఈ తిప్పలు, ఈనాటిది కాదు. వేలవేల సంవత్సరాల నాటివి ఈ గుడి శంకులమ్మ తల్లిది. ఆయమ్మ ఎవరనుకుంటు న్నారు రామలక్ష్మణ దేవుళ్లకు ఎంగిలి పండ్లు తినిపించిన శబరమ్మ తల్లి. ఆనాడు ఆ దేవుల్లు ఈడ తిరుగాడినారట. ఈడకు వచ్చా రట. అమ్మ తల్లి సీతమ్మ తల్లి ఆనవాలు అడి గినారట. సీతమ్మ జాడ తెలుపమన్నారట. ఆ శబరమ్మ తల్లి అదృష్టం, ఆ దేవుళ్లను చూడ డమే కాదు. ఆరిని కూకనబెట్టి తన ఇంట నున్న పండ్లను కొరికి మంచివా, కావా, కుళ్లి నివా, అని ఎంగిలి చేసి, ఆ దేవయ్యలకు తిని పించిదట. ఆ చెరువులోని నీళ్లు దోసిళ్లతో పట్టి, రేగు ఆకులను దొన్నెలుగా చేసి, పొర బోతుందని నీళ్ల ఇచ్చిందట మా శబరమ్మ తల్లి. ఆ మహాతల్లి పేరిట ఈడ గుడిలో ఎంగిలి పండ్లు, చిలుక కొరికిన పండ్లు, ఆకులు, కట్టే పుల్లలు, లేత చిగురులు ఏళ్లు, పచ్చికూరలు, వాడని పూలు, మా అమ్మకిస్తరు. ఆ మూలనున్న రామలక్ష్మయ్యల కిస్తరు. సంవత్సరానికి ఓ పూట ఈడ జాతర జరుగుద్ది. ఆనాడే అదేవయ్యలు ఈడకొచ్చి శబరమ్మ పెట్టిన ఎంగిలి పండ్లు తినినార న్నది మా నమ్మకం. అయ్యా పెద్ద సదువులు సదివిన పెద్ద అయ్యలు మీకు తెలవంది కాదు. ఆ కృష్ణయ్య, పెద్ద దేవయ్య గీతలో సెప్పినట్లు పత్రం, పుష్పం, ఫలం తోయం యేమే భక్తా, ఆయమ్మ తల్లికి అదేవ య్యలకు, నమ్మకంతో, ప్రీతితో, ప్రేమతో, భక్తితో, గౌర వంతో, ఆ దేవుళ్లకు ఆకులు, పండ్లు ఇస్తామయ్యా. సంవత్సరానికి ఒక పూట ఈడ జాతర జరుగుతుం టది. ఆ జాతర నాడే ఈడకు రాముడొచ్చి శబరమ్మ కొరికిన ఎంగిలి పండ్లు తిన్నాడన్నది మా నమ్మకం. ఈ కొండ అడవిలో దొరికిన సింతకాయలు, జామ కాయలు, అత్తి కాయలు తేనె అన్ని మా తల్లికి మా దేవయ్యలకిస్తాం అది మా ఆచారం. నేటి మా పిల్లకా యలు, మాలో కొందరు జింకలు, గేదెలు, పాములు, కోళ్లను రహస్యంగా బలులిస్తా ఉండారు అది తప్పని నేనంటాను. ఒప్పని వారంటారు. రక్తబలులు రాక్షసు లుదిరా మన ఆచారం కాదురా అంటే వారు వినరు. గపుచిప్పని ఓరు సూడకుండా, నాకు తెలియకుండా సేత్తా వుండరు, బలులిత్తా వుండరు.

అని క్షణం ఆగి అందరిని గమనించి జారిపోతున్న సంచిని పైకి లాగుకొని

'సారూ ఆయమ్మ తల్లి ఎవరనుకున్నారు మా వంశ స్తురాలు. మా గిరిజన కుల పెద్ద. శబరమ్మ తల్లి. ఆనాటి ఆశ్రమమే నేడు గుడిగా మారిపోయింది. శబరి తల్లి పలుకులో బేధమొచ్చి శంకులమ్మగా మారిపో యింది నాటి ఆశ్రమమే నేటి గుడి ఆ తల్లిలాగా మేమూ సేవాతత్పరులమే. మనుషులకే కాదు దేవయ్య లకైనా సాయమందించే జాతి మాది. మా గిరిజన జాతిలో సేవ నిండిపోయింది.క్షణం ఆగి వేదిక మీద నుంచి వెనుదిరిగి

'అయ్యా ఈ గుడి వెనుక నున్న సెరువు మీరు సరస్సు అంటారు. ఈ నీటి కాడికి దూరంలో నున్న ఈ బారుడు సెట్ల కాడకి, దేశ దేశాల నుంచి పచ్చికూనలు వచ్చి వాలిపోయి ఈడ పరాచికాలు ఆడి, గుడ్లు పెట్టి, పొదిగి నలుసులకు రెక్కలొచ్చిన కాడ అన్నింటిని కూడగట్టుకుని దేశాలకు యెగిరి యెగిరిపోతాయి. ఈ శుంకులమ్మ నీడలో ఆ దేవయ్య రాములయ్య నడిచిన నేలలో తిరుగాడిన కాడ గుడ్లు ఈడనే పెట్టి, ఎగిరినందున దేవతా పక్షులంటామయ్యా. ఈయమ్మ తల్లి గుడిని దేవుళ్లు తిరుగాడిన నేలలో మీరు ప్రాజెక్టు కట్టి ముంచేస్తావుంటే, మేము నోరు మూసుకుని సూత్తా వుండాలయ్యా, ఇది మీకు ధర్మమా, మా నోటికాడి కూడు తీస్తావుంటే సూస్తా సేతులు కట్టుకుని వుండాలయ్యా, ఇది న్యాయమా అయ్యా, మా నమ్మకాన్ని ఈడ నీళ్లలో ముంచుతా వుంటే మేము మునగాలా అయ్యా, ఈడ సెట్టుకు, ప్రతి పుట్టకు ఓ కథ వుండాదయ్యా, మా బతుకులు బుగ్గిపాలు సేసి ఈ ప్రాజెక్టు కడితే మీకు ఏటవతది.

అని ఒక్క క్షణం ఆగి రొప్పుతున్న క్షణంలో ప్రాజెక్టు అధికారి తేరుకుని యాదవ్వను గమనించి మైకు తీసుకుని రాముడు లక్ష్మణుడు దేవుళ్లు. శబరి, ఎంగిలి పండ్లు ఫలహారాలు. దేవతా పక్షులు ఈ పుక్కిటి పురాణాల కథలు వినే ఓపిక. టైం మాకు లేదు. ముసలమ్మా మీరు ఈ గూడెం ఖాళీ చేయవలసిందే. ఈ కొండల మధ్య ప్రాజెక్టు కట్టవలసిందే. మీకు మరో చోట నివేశన స్థలం ఇస్తాం. పక్కా గృహాలు పంట పొలాలు ఇస్తాం. మీ శుంకులమ్మ దేవాలయం. అక్కడ నిర్మించి ఇస్తాం. అదిగో దూరంలో కనిపించే ఆ కొండ తిప్పల కింద మీ ఇళ్లు నిర్మిస్తాం అందరినీ గమనించి పోలీసు అధికారులతో కలిసి నడవసాగాడు ప్రాజెక్టు అధికారి.


యాదవ్వ బిక్కమొహంతో చూడసాగింది. ఆ అధికారితో వున్న మరో పత్రికా విలేఖరి యాదవ్వ దగ్గరగా వచ్చి యాదవ్వను ఫొటో తీసి

'ఈ కొండ తిప్పల విషయాలు నాకు తెలియజేయాలి అవ్వా' అన్నాడు. బోసినవ్వుతో విలేఖరిని గమనించి, కర్రపోటుతో అడుగులేస్తూ-

'ఈడ ప్రతి చెట్టుకు, పుట్టకు, తిప్పకు, బండకు, ఒక కథ వుండాదయ్యా. మనిషి బతుకులో కష్టాలు, కన్నీళ్లు, పన్నీళ్లు, సన్నీళ్లు వుండినట్టే ఈడ తిప్పలకు కథలుండాయయ్యా. ఆడనున్న బండపైన రామయ్య కూకున్నాడటయ్యా, అని నడుస్తూ ఓరి బాబయ్యా దూరంలో ఆమడల దూరంలో నున్న ఆ కొండ తిప్పలను సూడు. నల్లగా ఎర్రగా నున్నదే ఆ తిప్పలు ఏటనుకుంటున్నారు. ఆ తిప్పలే బాబయ్య.

సీతమ్మ తల్లిని రావణాసురుడు యిమానంలో తీసుకెళతా వుంటే, జటాయువు పక్షి, అడ్డగించినాడట. ఆ మహాతల్లిని తీసుకెళ్ళబాక తప్పవతది ఆయమ్మ మహాతల్లీ మంచిది ఆమెను చెరబడితే నీ వంశం నిలవదు అని నిలవరించినాడట ఆ జటాయువు పక్షి. అప్పుడు ఆ రాక్షసుడికి కోపమొచ్చి, ఆ పెద్ద పక్షిని కత్తితో నరికినాడట. అది సచ్చిపోయి ఆ రక్తం దారగా ఆడ పడిపోయినదట. ఆ రెక్కలు ఇరిగి పోయినాయట. ఆ మొండెం ముక్కలు ముక్కలుగా ఆడపడినాయట. ఆనాటి ఆ పక్షి కళేబరమే ఆ తిప్పలట. ఆడ, నీళ్లుండదు. మొక్క చిగురించదు. ఆ మట్టిలో ఏదో ఇనప ముక్కలు ఉంటాయట అందుకే ఆడ ఏ చెట్టు మొలకెత్తదు. ఆపైనున్న గుడి. ఆ పక్షి గూడేనట. ఆ తిప్పలన్నింటిని నేడు కులసా వుండారట. ఆ గుడిని పెకిలించి వేస్తావుండారు బాబయ్య. అది దేవయ్య తిప్పలన్నది మా నమ్మకం. ఆడనున్న ఎర్రమట్టిని ఇనప మన్నును యెడకో తీసుకుని పోయి ఏటో సేత్తా వుండారట. అయ్యా మానోళ్లు కొట్టి నా నమ్మకాన్ని సితక కొట్టాస్తా వుండారయ్యా. పేదోళ్లం మేం ఏటిసేస్తాం. నోరు తెరుచుకుని అరవడం, లేకుంటే నోరు మూసుకుని ఏడవడం.

ఆళ్లు కొండలను తవ్వి తిప్పలుగా బండలుగా రాళ్లుగా, రప్పలుగా, నుసినుసిగా మార్చేస్తున్నారు. దేవయ్య ప్రసాదించిన ప్రకృతిని, సెట్లను పుట్టలను కూల్చేస్తా వున్నారు. ప్రకృతి అందాలను అందవిహీనం చేసి, నోట్ల కట్టలను మూట కట్టుకుంటున్నారు. మా నోళ్లు కొట్టేస్తున్నారు. ఇది న్యాయమంటావా అయ్యా.



మనం చేసుకున్న చట్టాలను కట్టుబాట్లను మనమే దాటుకుంటున్నాం. చంపేసుకుంటున్నాం కానీ బాబయ్య మా జాతి జనానికి కూడా మీలాంటి నాకరికుల నీడలు పడి, మా పసికూనలను నోట్ల ఎర చూపి ఇక్కడి చెట్లను పరికించేస్తున్నారు.

కాలికి గుచ్చుకున్న ముల్లును తీసి దూరంగా విసిరేసింది. ఆ పొదలో నుంచి ఏదో విషనాగు సరసరమని పాకుతూ వెళ్ళిపోయింది. విలేఖరి క్షణంసేపు భయపడి యాదవ్వను చూసి 'అవ్వా ఇక్కడ విష నాగులు, పులులు ఉంటాయా, ఆ నాగులు కరిస్తే మీకు జబ్బులు చేస్తే మందులు ఎవరిస్తారు.'

యాదవ్వ బోసి నవ్వులతో భారంగా అడుగు వేసి 'మందులన్నీ మేం చేసుకుంటాం మా అయ్య, మా ఆయన వైద్యం సేస్తరు. ఈ కోనలో దొరికే ఆకులు అలుములతో సెట్టు వేళ్లతో బెరడులతో కలిపి వైద్యం చేస్తారు. ఎందరికో ఈ వైధ్యకం వివరాలు నేర్పినారు. నా అయ్య శిష్యులు ఎందరో వైద్యం సేస్తా వుండరు. మా వైద్య విధానం మనుషులకే కాదు. గేదెలకు, గొర్రెలకు కూడా మేం వైద్యం సేస్తాం. మనుషులకు వచ్చే గజ్జి తగ్గాలంటే మా ఆకులు అలములతో వైద్యం చేస్తాం.

కాళ్లగజ్జి, కంకాళమ్మ, వేగు చుక్క వెలగమొగ్గ, ముగ్గు కాదు మొదుగనీరు, నీరు కాదు మంచి గంధం చెక్క, లింగు లిటుకు పందెమేల పటకు, కాలు పండునట్లు, కడకు తీసిపెట్టు పై పాటలో గజ్జి నివారణకు కావలసిన వైద్య విధానం ఉంది. మా పిల్లలు పాడుకునే ఆట పాటలలో సెమ్మా - సెక్కా చారడేసి మొగ్గ, ఈ పాటలో ఆడపిల్లలకు సంతాన అభివృద్ధికి బాలింతలకు పాల అభివృద్ధికి కావలసిన వైద్య విధానం ఉంది అదే విధంగా ఒప్పులకుప్పా, వయ్యారి భామ అనే ఈ పాటలో పురుషులకు లైంగిక వృద్ధి, స్త్రీలకు సంతానాభివృద్ధి కలుగజేసే ఔషధ మొక్కల గురించి వివరించారు. ఉల్లి పది తల్లుల పెట్టు, ఉల్లి చేసే మేలు తల్లి చేస్తుంది. ఇలా ఎన్నో రకాల వైద్య విధానాలు మా గిరిజనులు తరతరాల నుంచి అవలంబిస్తున్నారు. ఈ కొండ అడవిలోని మొక్కల ద్వారా మా పిల్లలు లంగా అనే ద్రవాన్ని తయారుచేసుకుని తాగుతారు మీరు తాగే బ్రాందీ బీరు సారాయి లాంటిది.

ఓరి బాబయ్యా ఆ సెట్టును సూడు దాని నిండా ఏటుండదో సూడు సెట్టు నిండా తేనె పట్టులే తేనె తిస్తరు. మా పిల్లకాయలు, అలాంటి సెట్టు మీదనే అంట, పాండవులు ఆయుధాలు దాపెట్టింది. ఆ సెట్టు ఎక్కితే ఈగలు తరుముకుంటాయి. ఆటిని దూరం నుంచి సూస్తే శవం లాగుంటది. బారుగానున్న ఆ సింత సెట్టులో సిగరు కోస్తరు సింతకాయ దింపుతారు. దింపిన కాడ సింతపండు పట్నంలో అమ్ముకుంటారు. ఈ అడవే మా జీవనాధారం. ఈ గాలిని, ఈ నీళ్లను, ఈ కొండ తిప్పను, ఈ సెట్లను ఈ గుడిని, ఈ శుంకులమ్మను వదిలి ఏడకో ఎళ్లమంటే మా బతుకెట్లా. ఆనాడు దేవుడు రామయ్య తిరుగాడిన నేలను వదలి, మమ్మల్ని తరిమేస్తరా అయ్యా, ఈ అడవులు ఇంకా బతికి వున్నాయంటే మా గిరిజనులు పుణ్యమేనయ్యా, మేం మొక్కలను వేళ్లతో పీకేయమయ్యా. అలా పెరకడం, మాలో పెద్ద తప్పు. మా మతాచారాల ప్రకారం మనిషిని హత్య చేసినంత నేరం. మేం ఇరగదీసిన మొక్క మరలా నీటి చుక్క పడితే, చెమ్మ ఎక్కితే, మళ్లీ మొలకెత్తది. మొలకెత్తిన కాడనే పెరిగి మరలా మానవతది.

యాదవ్వ బారుగా నున్న చెట్ల వైపు చూసి ఆకాశం పైనుంచి చెట్ల మధ్య నుంచి వస్తున్న వెలుగు రేఖలను గమనించి, దూరంగానున్న నీటిపాయను చూసి, సన్నని స్వరంతో కర్రపోటుతో నడుస్తూ,

'మా వైద్య' పసర్ల కోసం వినియోగించే మొక్కలను గుడులున్నచోట నీళ్లు పారుతున్న చోట, పెద్దపెద్ద మానుల దగ్గరగా మేం పసర్లకు పనికివచ్చే మొక్కలను జాగ్రత్తగా పెంచుకుంటాం. వాటికి నీరు పారేట్లుగా పొదలు చేసుకుంటాం. ఈ వైద్య విధానం మాకు దేవతలిచ్చిన వరం. ఈ గాలి, ఈ భూమి, ఇందులోని మన్ను, ఈ నీళ్లు, ఈ వెలుగు ఈ మొక్కలు, ఈ మానులు, అన్నీ దేవయ్యలదే. వారు మన కొరకు అన్నీ ఇచ్చారు. ఈ మొక్క అన్నా ఈడనున్న జీవాలన్నా అన్నీ మాకు దేవతలతో సమానం. ఈ విషయం నేను చెప్పబల్లేదయ్యా. పెద్ద దేవయ్య కృష్ణయ్య గీతలో కూడా సెప్పినాడు. అన్నీ తానే అన్నాడు. అన్నీ మన కోసమే అన్నాడు. అన్నింటిలో దేముడున్నాడన్నాడు. వాటిని సెడుపుకోవద్దన్నాడు. తన ప్రసాదంలా భావించమన్నాడు. మనం మనుషులం. బుద్ధి, ఘ్నానం తెలివి అందుకే ఇచ్చానన్నాడు.

మన మానులను మనం కూల్చుకుంటున్నాం, మన అడవులను మనమే ధ్వంసం చేసుకుంటున్నాం, మన కొమ్మలను, మన తలలను, మన నీడను, మన గాలిని మనం సెరిపేసుకుని నరికేసుకుని మురుసుకుంటున్నాం. యాదవ్వ క్షణం ఆగి చుట్టూ చూసి

'మనం చేసుకున్న చట్టాలను కట్టుబాట్లను మనమే దాటుకుంటున్నాం. చంపేసుకుంటున్నాం కానీ బాబయ్య మా జాతి జనానికి కూడా మీలాంటి నాకరికుల నీడలు పడి, మా పసికూనలను నోట్ల ఎర చూపి ఇక్కడి చెట్లను (మిగతా 27వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

నరికించేస్తున్నారు. ఈ అడవిలో స్మగ్లర్ల దోపిడి వలన అడవులు కూలుతున్నాయి. బండరాళ్లు పగులు తున్నాయి. మా నోటి కాడి కూడు మాకు దక్కటం లేదు.

'ఈ మొక్క పసరు పాము కాటుకు పనికి వస్తుంది. ఎంతటి నాగు కాటేసినా ఈ పసరు పిండి కట్టుకడితే మనిషికి విషం ఎక్కదు. దీన్ని మేము వైద్యంగా వాడతాం. ఉచితంగా ఇస్తాం. సేవ చేస్తాం. అదే మీ నాగరికులు మా దగ్గరకు వచ్చి ఈ పసర్ల గురించి నేర్చుకుని సూదుల రూపంలో మనిషికి ఇచ్చి, కోట్లు గడించేస్తున్నారు. బాగులేని మనిషి బాధపడుతూ వైద్యం కొరకు వస్తే, మా వాళ్లు ఉచితంగా చేస్తారు. వారికి నయం కావాలని మేం దేవుణ్ణి ప్రార్థిస్తాం. అదే మీరైతే నోట్ల కట్టలు లేందే, రోగిని చూడరు. వారి రోగం గురించి పట్టించుకోరు. బాలింత రాళ్లకు మేమే కాన్పులు చేస్తాం. అదే మీరు కత్తులతో కడుపులు కోసి ఆ రక్తంతో నోట్లు లాగేసుకుంటారు'

అని అటు ఇటు చూసి దూరంలోని దిబ్బ లాంటి స్థలం దగ్గరకు నడవసాగింది యాదవ్వ. అక్కడంతా, పూల మొక్కలు పెరిగి ఎత్తుగా నున్న మట్టి కుప్ప. అక్కడ ఒక్క క్షణం ఆగి

'బాబయ్య ఇది ఏటనుకుంటున్నారు. మా ఆయన్ను పాతి పెట్టిన సమాధి. ఆరు అడుగుల నేల. మాకు వందల ఎకరాలు అక్కరలేదు. దీని చుట్టూ వైద్యానికి పనికివచ్చే మొక్కలు. సచ్చిన కాడ కూడా మా సమాదుల చుట్టు మొక్కలే. వైద్యానికి పనికి వచ్చే పసర్లే. ఇక్కడ మేం వారుకునేది బావుకునేది, తీసుకెళ్లెది ఏమీ లేదు.

ఈ గాలి, ఈ నీరు, ఈ భూమి, ఈ మన్ను, ఈ మొక్క, ఈ పసరు అన్నీ మన కోసమే. మన జనం కోసమే అదే మా భావన. అదే మీరు ఇక్కడ ప్రాజెక్టు కట్టి మమ్మల్ని ముంచేస్తామంటున్నారు. మా బతుకులను బండలపాలు చేసేస్తున్నారు.

యాదవ్వ తన భర్త సమాది దగ్గరగా నడిచి, ఆ మట్టిని చేతికి తీసుకుని అయ్యా నీ సమాదిని తీస్తరట. ఈ మన్ను ఆ భూమి, ఈ సెట్టు, ఈ పుట్టను పెరికేస్త రట. ఈడ అంతా నీళ్లతో నింపేస్తరట. దేవుళ్లు రామయ్య, లక్ష్మణయ్య నడిచిన నేలను దున్ని, దున్ని గుంటలు సేసి సేసి ఏదో కట్టేస్తరట. శుంకులమ్మ తల్లి గుడి కూలిస్తరట. యాదవ్వ ఆ సమాది దగ్గరగా మట్టిని గాలి వాటంగా వదులుతూ కర్రపోటు భారానికి నిలవలేక భారంగా నేల వాలిపోతున్నది. క్షణ క్షణం గడుస్తుంటే కళ్లు తెలిపోతూ మూతలు పడిపోయాయి.

ఆ ముదుసలి ఆ శతాధిక వృద్ధురాలి ప్రాణం ఆ జీవం అనంత వాయువుల్లో కలిసిపోయింది.

* * *

శతాధిక వృద్ధురాలు యాదవ్వ మట్టిలో కలిసిపోయింది. తన భర్త సమాధి పక్కనే వాలిపోయింది. ఆ గూడెం వాసులు యాదవ్వను గుంటచేసి సమాధిలోకి నెట్టేశారు మట్టిని కప్పేశారు. ఆ ప్రాణం గాలి గాలిలోకి వెళ్ళిపోయింది. మన్ను మన్నుగా మారిపోయింది. యాదవ్వ మరణ వార్త తెలిసి కాబోలు, దుఃఖభారంతో మేఘం వర్షించ నారంభించింది. చినుకు చినుకు పడుతూ వుంటే ఆ మట్టిలో వైద్యానికి కావలసిన మొక్కలు మొలుస్తున్నాయి. చిగురు రెమ్మలు చిరుగాలికి వూగుతూ మరో రెమ్మతో పరాచకాలు ఆడుతున్నాయి. యాదయ్యా యాదవ్వా అని అరుస్తున్నాయి.

పునరపి జననం పునరపి మరణం, మరణం తర్వాత కూడా బతికి వుండే వారే మహాత్ములు. మరిచి పోయేవారు సామాన్యులు, కాదంటే రాక్షసులు. ★


రచయిత చిరునామా:
శనగవరపు బాలసుబ్రహ్మణ్యం
8-1-29, బ్రాహ్మణ వీధి,
కోవూరు - నెల్లూరు జిల్లా.


(19 పేజీ తరువాయి)

ఏం జరుగుతోందో ఎవరికీ అర్థంకాక చుట్టూ చేరారు కుటుంబసభ్యులందరూ.

'చెప్పు..చిత్రను ఎందుకు చంపావ్' అడిగాడు ఎస్.ఐ.

నెత్తిన పిడుగు పడినట్లయింది ఇంట్లోని వారందరికీ..మాట రాకుండా అలాగే వుండిపోయారు.

'నేను..నేనెందుకు చంపుతాను..'చిన్నగా వణుకుతున్న కంఠంతో ఎదురుప్రశ్నించాడు మధుసూదన్.

'సరే..రాణి ఎలా వుంది' మళ్లీ అడిగాడు ఎస్.ఐ.

'రాణి..రాణి..ఎవరు..నాకేం తెలియదు..నేను అలాంటివాడినికాను'తడబడ్డాడు మధుసూదన్..

'అలాంటివాడివి అంటే..ఎలాంటివాడివని నేనన్నాను..రాణి తెలియడం అంటే అలాంటివాడివి అవుతావని నీకు ఎలా తెలుసు..'రెట్టించాడు.

దొరికిపోయానని అర్థం అయింది..మధుసూదన్‌కు..సోఫోలోంచి నేలపైకి జారి రెండు చేతుల్లో ముఖం దాచుకుని ఏడ్వడం మొదలు పెట్టాడు.

'ఏమిటిదంతా సార్..'భర్త బాధపడడం చూడలేక అడిగింది సుకన్య.

'మీ చెల్లిని చంపింది మీ ఆయనే' మిస్టరీ గుట్టు విప్పాడు ఎస్.ఐ.

మరో సారి అందరి రోదనలతో గొల్లుమని ప్రతిధ్వనించింది ఆ ఇల్లు.

* * * * *

మధుసూదన్ స్వతహాగా మంచివాడే..చిత్ర అంటే అభిమానమే..అందుకే డాక్టర్లు వద్దని చెప్పినా..ఎవ్వరికీ తెలియకుండా చాక్లెట్లు కొనిచ్చేవాడు. నిజానికి చిత్ర పుస్తకాల్లో చాలా చాక్లెట్ రేపర్లు దాచుకుంది. అవి చూసి నేను ఆ యాంగిల్‌లో దర్యాప్తు చేసాను..దుకాణాల వారందరూ చిత్రను తీసుకొచ్చి మధుసూదన్ కొంటాడని చెప్పాడు..కాని చిత్రను చంపేంత మోటివ్ కనిపించలేదు..చూద్దామని ఆతనిపై నిఘా వేస్తే రాణి బయటకు వచ్చింది. మధుసూదన్‌కు వున్న ఏకైక వీక్‌నెస్ రాణి. ఎప్పుడో లారీలో పాసింజర్‌గా పరిచయమై..ఉంపుడుగత్తెగా మారింది. దాని గొంతెమ్మ కోర్కెలు తీర్చడం కోసం అప్పడప్పుడు అప్పులు చేయక తప్పలేదు..ఆఖరికి పుట్టిన రోజు సాకుతో బంగారం నగ కావాలంది..కొనే పరిస్థితి లేక ఇంట్లో చిత్ర నగ దొంగిలించి ఇచ్చాడు.

టేబుల్‌పై వున్న మంచినీళ్ల గ్లాసు తీసుకుని తాగి మళ్లీ చెప్పడం ప్రారంభించాడు ఎస్.ఐ. వినయ్.

ఎప్పుడు లారీతో వచ్చినా అటూ ఇటూ తిప్పని మారాం చేసేది చిత్ర. ఆ రోజు లారీతో వస్తూ..చిత్ర ట్యూషన్ టైమ్ తెలుసుండడంతో తిన్నగా అక్కడకే వెళ్లాడు. చిత్ర ఎట్లైనా తీసుకెళ్లమంది. సరే అని బజారులో వెళ్తుంటే రాణి ఎదురొచ్చింది. మధు చిత్ర లారీలో వున్న సంగతి మరచి..బ్రేక్ వేసాడు. చురుగ్గా తలుపుతీసుకుని లారీ ఎక్కింది రాణి. అక్కడే చిత్ర దురదృష్టం..మధుకు కష్టకాలం ప్రాప్తించాయి..రాణి ఆ టైంలో మధు ఇచ్చిన నెక్లెస్ పెట్టుకుని వుంది. అది చూడగానే చిత్ర గుర్తుపట్టింది..ఇది తన నెక్లెస్సే అంది..దాంతో ఏం చేయాలో తోచక రాణీ నెక్లెస్ ఒక సారి ఇస్తే మళ్లీ ఇస్తానని బుజ్జగించి..నెక్లెస్ తీసుకుని ఆమెను దింపేసాడు. విషయం అంతా ఇంట్లో తెలిస్తే..తన బండారం బయటపడుతుంది..భార్య దగ్గర గొడవ తప్పదు..మావగారింట్లో పరువుపోతుంది..గత్యంతరంలేని అయోమయ స్థితిలో చిత్ర వాటర్‌ఫాల్స్ దగ్గరకు వెళ్దామని చెప్పి తీసుకెళ్లి జాకీ రాడ్‌తో తలపై కొట్టి చంపాడు

అదీ విషయం....అంటూ ముగించాడు ఎస్.ఐ.

నరసింహారావు కుటుంబ సభ్యులంతా అలా నిశ్చేష్టులై నిలబడిపోయారు.

ఇంతలో రాణీని తీసుకుని ఒక కానిస్టేబుల్ లోపలికి వచ్చాడు. సుకన్య ఆమె వంక..భర్త వంక అసహ్యంగా చూసి..గిరుక్కున లోపలి గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది..ఓ కానిస్టేబుల్ ముందే ఊహించి నట్లు చటుక్కున వెళ్లి మూసుకుంటున్న తలుపును ఆపాడు. 'వదలండి..నేను బతకను...అంటూ హిస్టీరియా వచ్చినట్లు ఏడుస్తూ అరవడం ప్రారంభించింది సుకన్య.

మధుసూదన్‌ను..రాణిని తీసుకుని బయటకు నడిచారు పోలీసులు.

* * * * *

నిజానికి నాకు ముందు చాక్లెట్ రాపర్లు..డాక్టరు వద్దన్నా కొనివ్వడం..కొంచెం ఇబ్బంది పెట్టింది..తరువాత నిజానికి చిత్ర అంటే ఇష్టమే అని తేలింది...అయినా మరింత నిర్ధారణ కోసం కానిస్టేబుళ్లను నిఘా వుంచితే..రాణి విషయం తేలింది. అయినా చంపి వుంటాడని..చంపాల్సిన అవసరం వుంటుందని అనుకోలేదు..

కేసు గురించి సి.ఐ.రఘురామ్‌కు వివరించాడు ఎస్.ఐ. వినయ్.

రాణి దగ్గర ఖరీదైన నెక్లెస్ వుందని తెచ్చి చూపించాడు మన కానిస్టేబుల్..దాన్ని చూడగానే చిత్ర కనిపించడం లేదంటూ ఇచ్చిన ఫొటోలో ఆ నెక్లెస్ చూసినట్లు అనిపించింది. నా అనుమానం నిజమే అని తేలాక..ఆ వైపు పరిశోధించాను..కాని అప్పుడూ ఎందుకు హత్య చేయాల్సి వచ్చిందో తెలియలేదు. రాణి మెడలో చిత్ర నెక్లెస్ చూసిందన్న విషయం ఆమె ద్వారానే తెలియడంతో ముడి వీడిపోయింది..అంటూ ముగించాడు వినయ్.

'చిన్న సంఘటన ఒక్కోసారి ఎంత దారుణానికి దారితీస్తుందో అనడానికి ఈ కేసే ఉదాహరణ...'అంటూ కుర్చీలోంచి లేచాడు సి.ఐ.రఘురామ్. ★